నేడు ఈద్ ఉల్ ఫితర్

ఈద్గాల్లో ప్రార్థనలకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-అనంతపురం

ముస్లిములు నెల రోజుల పాటు చేపట్టిన ఉపవాస దీక్షలు ముగిశాయి. శుక్రవారం రాత్రి నెలవంక కన్పించడంతో శనివారం నాడు ఈద్ ఉల్ ఫితర్ (రంజాన్) పండుగ నిర్వహించుకునేలా మత పెద్దలు నిర్ణయించారు. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించుకునేందుకు అన్ని ఏర్పాట్లనూ పూర్తి చేశారు. శనివారం నాడు అన్ని ప్రాంతాల్లోనూ ముస్లిములు రంజాన్ పండుగను సంబరంగా జరుపుకోనున్నారు. రంజాన్ పండుగ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేసుకునేందుకు ఈద్గాలను ప్రభుత్వం, ముస్లిం మతపెద్దల ఆధ్వర్యంలో ఇప్పటికే సిద్ధం చేశారు. ఎండలు అధికంగా ఉన్నందున ఉదయం 9 గంటలలోపు ప్రార్థనలు ముగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. అనంతపురం నగరంలోని ఈద్గాతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మసీదులు, ఈద్గా మైదానాల్లోనూ ప్రత్యేక ప్రార్థనలు జరగనున్నాయి. ప్రార్థనల అనంతరం మసీదు మౌలానాలు, పెద్దలు పవిత్ర రంజాన్ విశిష్టతను తెలియజేస్తారు. ముస్లిం సోదరులకు ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, అధికారులు పండుగ శుభాకాంక్షలను తెలియజేశారు.

సెల్ఫీ ఛాలెంజ్..!

- ◆ కాక రేపుతున్న నేతల సవాళ్లు
- ◆ ఆగిన అభివృద్ధి పనుల వద్ద సెల్ఫీలు దిగుతున్న టిడిపి నేతలు
- ◆ నాలుగేళ్లలో ముందుకు కదలని పనులపై చర్చ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికలకు సమయం ముంచుకొస్తున్న కొద్దీ అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపిల మధ్య మాటల యుద్ధమే కాకుండా సెల్ఫీ ఛాలెంజ్‌లు పెరిగాయి. ఈ రెండింటితో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటలయుద్ధం కొనసాగుతోంది. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పాదయాత్ర సందర్భంగా ఆయా నియోజకవర్గంలో పర్యటించినప్పుడు కొన్ని సమస్యలపై సెల్ఫీ ఛాలెంజ్‌ల పేరుతో ఫొటోలు దిగి పెట్టారు. ఆయన పాదయాత్ర జిల్లాలో ముగిసిన తరువాత ఇప్పుడు జిల్లా తెలుగుదేశం నాయకులు కూడా అదే బాటలో పయనిస్తున్నారు. నాలుగేళ్లలో వైసిపి చేపట్టలేని పనులను ఎత్తి చూపుతూ ఆయా పనుల వద్దకెళ్లి సెల్ఫీలు దిగి పోటోలు పెడుతున్నారు. అదే సమయంలో వారు అధికారంలోనున్న సమయంలో 2014 నుంచి 2019 వరకు జరిగిన అభివృద్ధి లెక్కలను చెబుతున్నారు. ఇది రాజకీయ దుమారాన్ని రేపుతోంది. రాయదుర్గంలో గుమ్మగట్ట వద్ద సంక్షేమ వసతి భవన నిర్మాణం పూర్తవకపోవడాన్ని ఎత్తి చూపుతూ మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు సెల్ఫీ దిగి పెట్టారు. అంతే కాకుండా ప్రతి సోమవారం ఒక సెల్ఫీ ఛాలెంజ్‌ను విరుసుతున్నట్టు చెబుతున్నారు. ఆయన హయంలో ఏమి చేపట్టార్న దానిపై వివరాలు వెల్లడిస్తున్నారు. దీనికి ప్రతిగా ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ప్రతి స్పందించారు. దీంతో ఇద్దరి మధ్య చోటు చేసుకున్న వివాదం తీవ్ర స్థాయిలోనే గురువారం చోటు చేసుకుంది. సవాళ్లు, ప్రతి సవాళ్ల మధ్య పోలీసులు జోక్యం చేసుకుని సర్దిజెప్పారు. అదే సమయంలో అనంతపురం మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి తమ హయంలో నిర్మంచ తలపెట్టిన టిడ్కో ఇళ్లు నాలుగేళ్లు అయినా పూర్తవకుండా ఉన్నాయంటూ ఆయన కూడా టిడ్కో ఇళ్ల వద్దకెళ్లి సెల్ఫీ ఛాలెంజ్ విసిరారు. దీనికి అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి కూడా ప్రతి స్పందించారు. వారి హయంలో గ్రూపు తగాదాలతోనే సరిపోయిందని, తాము అధికారంలోకి వచ్చాకనే అనంతపురం నగరంలో పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని చెబుతున్నారు. ఇద్దరి మధ్య మాటల యుద్ధం కొనసాగుతూనే ఉంది. రాప్తాడులోనూ మాజీ మంత్రి పరిటాల సునీత శుక్రవారం నాడు సెల్ఫీ ఛాలెంజ్ విసిరారు. జీడిపల్లి నుంచి పేరూరుకు ఎత్తిపోతల పథకాన్ని తమ హయంలో ప్రారంభించి 30 శాతం పూర్తి చేసినట్టు కాలువలను చూపించారు. ఒక్క రిజర్వాయర్ కాదు మూడు రిజరాయర్లు కడతామని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక శంకుస్థాపనలు చేసారని గుర్తు చేశారు. అయితే అవి ఒక్కడుగు ముందుకు కదల్లేదని విమర్శలు చేశారు. అదే సమయంలో తమ హయంలో రామగిరి మండలంలో నిర్మించిన బాలికల వసతి గృహం ముందు నిలబడి సెల్ఫీ ఛాలెంజ్ అని పోటోలు పెట్టారు. ఇదే తరహాలో తాడిపత్రిలోనూ ఇసుక అక్రమాలు జరుగుతున్నాయని, వీటిని అడ్డుకుంటామిని జెసి.ప్రభాకర్‌రెడ్డి చెబుతుండగా, అడ్డుకుని చూడమని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఛాలెంజ్ చేస్తున్నారు. వీరే కాకుండి ఇతర టిడిపి నాయకులు కూడా ఇదే తరహాలో తమ ప్రాంతంలో ఆగిపోయిన పనులకు సంబంధించి సెల్ఫీలు దిగి ఫోటోలు విడుదల చేస్తున్నారు. శింగనమల నియోజకవర్గం పరిధిలో గార్లదిన్నె మండల కేంద్రంలో ఆగిన ఇండోర్ స్టేడియం ముందు నిలబడి టూమెన్ కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి సెల్ఫీ ఛాలెంజ్ విసిరారు. ఇలా అనేక చోట్ల టిడిపి నాయకులు ఆగిన అభివృద్ధి పనులను ఎత్తి చూపుతూ సెల్ఫీ ఛాలండెజ్‌లు విసురుతున్నారు.

పెనుకొండ కొండపై టిడిపి హయాంలో వేసిన రోడ్డును చూపి సెల్ఫీ ఛాలెంజ్ విసురుతున్న మాజీ ఎమ్మెల్యే బికె.పార్థసారథి

'స్పందన' పరిష్కారానికి ప్రాధాన్యత

గడువులోపు అర్జీలను పరిష్కరించాలి
నిర్లక్ష్యం వహించే అధికారులకు మెమోలు
కలెక్టర్ పి.అరుణ్ బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

కలెక్టర్ అరుణ్‌బాబు

వివిధ సమస్యలపై స్పందన గ్రీవెన్స్‌లో ప్రజలు ఇచ్చే అర్జీల పరిష్కారానికి సంబంధిత అధికారులు అత్యంత ప్రాధాన్యతను ఇచ్చి వాటిని గడువులోపు పరిష్కరించాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆయా శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. పుట్టపర్తిలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి స్పందన గ్రీవెన్స్, బియాండ్ ఎస్ఎల్ఏలు, రీఓపెన్ గ్రీవెన్స్‌లు, అధికారుల క్షేత్రస్థాయి పర్యటన, తదితర అంశాలపై జాయింట్ కలెక్టర్ టిఎస్.చేతన్, పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, డిఆర్ఒ కొండయ్య, ఆర్డీవోలు భాగ్యరేఖ, రాఘవేంద్ర, తిప్పేనాయక్‌తో కలిసి వివిధ శాఖల జిల్లా అధికారులు, తహశీల్దార్‌లు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్‌లతో శుక్రవారం నాడు టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పందన గ్రీవెన్స్ బియాండ్ ఎస్ఎల్ఏలోకి ఒక్కటి కూడా రాకూడదన్నారు. గ్రీవెన్స్‌ని సకాలంలో పరిష్కరించాలన్నారు. బియాండ్ ఎస్ఎల్ఎ వస్తే సంబంధిత అధికారులకు మెమో జారీ చేయాలని డిఆర్ఒని ఆదేశించారు. రాష్ట్రస్థాయిలో స్పందనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని, దీనిని అర్థం చేసుకొని గ్రీవెన్స్ గడువులోపు పరిష్కరించాలని ఆదేశించారు. సమస్య పరిష్కారంపై అర్జీదారుడు సంతప్తి వ్యక్తం చేశారా.? లేదా.? అనేది కూడా చూడాలన్నారు. రీఓపెన్ కేసులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. సంబంధిత శాఖల అధికారులు వ్యక్తిగతంగా రీఓపెన్ కేసులపై ప్రత్యేక దష్టి సారించి పరిశీలన చేసి పరిష్కరించాలని ఆదేశించారు. ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలకు సంబంధించి తహసీల్దార్ లు ఎలాంటి పెండింగ్ లేకుండా దరఖాస్తులను సకాలంలో అందించాలన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గుర్తించిన పనులకు వెంటనే అనుమతి తీసుకుని పనులను గ్రౌండింగ్ చేయాలన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు గుర్తింపుగా 'నేషనల్ సివిల్ సర్వీసెస్ డే'

ప్రభుత్వ ఉద్యోగులను గుర్తించి, వారికి స్ఫూర్తిగా నిలిచేందుకు నేషనల్ సివిల్ సర్వీసెస్ డేను జరుపుకుంటున్నామని అని కలెక్టర్ అరుణ్ బాబు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లోనే మినీ కాన్ఫరెన్స్ హాల్లో 16వ నేషనల్ సివిల్ సర్వీసెస్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ టిఎస్.చేతన్, ఆర్డీవో భాగ్యరేఖ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశంలోని వివిధ పబ్లిక్ సర్వీస్ విభాగాల్లో నిమగ్నమై ఉన్న అధికారుల పనిని గుర్తించేందుకు ప్రతి సంవత్సరం ఏప్రిల్ 21న దీనిని పాటిస్తారన్నారు. పౌర సేవకులు దేశం పరిపాలనా యంత్రాంగాన్ని సమిష్టిగా, పౌరులకు సేవ చేయాలనే అంకితభావంతో నడపాలని కూడా ఈ రోజు ప్రధాన అంశమన్నారు. సివిల్ సర్వీస్ అనేది దేశ ప్రభుత్వం ప్రజా పరిపాలనకు బాధ్యత వహించే సేవ అన్నారు. అనంతరం 16వ నేషనల్ సివిల్ సర్వీసెస్ డేను సందర్భంగా సభ్యులచే కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు.

ఆరిన ఇంటిదీపం

ప్రయివేటు స్కూల్ బస్సు కిందపడి చిన్నారి మృతి

మృతి చెందిన విహాన్(ఫైల్‌ఫొటో)

పాఠశాలకు వెళ్లిన బాలున్ని బస్సు రూపంలో మృత్యువు కబళించింది. తాను ప్రయాణించిన బస్సుకిందే పడి మృత్యుపాలయ్యాడు. పాఠశాలకు వెళ్లిన తమ కుమారుడు ఇంటికొస్తాడని కాచుకుకూర్చొన్న తల్లిదండ్రులకు కుమారుని మరణవార్త గుండెలు పగిలేలా చేసింది. కళ్లలోపెట్టుకుని అల్లాముద్దుగా పెంచుకుంటున్న కుమారుడి అకాల మరణంతో ఆ ఇంటిదీపం ఆరిపోయింది.

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

కళ్యాణదుర్గం మండలం చాపిరి గ్రామంలో ప్రయివేటు స్కూల్ బస్సు కింద పడి ఐదేళ్ల చిన్నారి మృతి చెందిన ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... మండల పరిధిలోని చాపిరి గ్రామానికి చెందిన మధు, వాణిల కుమారుడు విహాన్(5) కళ్యాణదుర్గం సమీపంలోని జ్ఞానభారతి పాఠశాలలో 1వ తరగతి చదువుకుంటున్నాడు. ప్రతి రోజూ ఈ చిన్నారి బడికి అదే పాఠశాలకు చెందిన బస్సులో వెళ్తూవస్తుండేవాడు. ఇదే విధంగా శుక్రవారం బడికి వెళ్లాడు. బడి ముగించుకుని అదే బస్సులో సాయంత్రం గ్రామానికి వచ్చాడు. బస్సు దిగి ఇంటికి వెళ్తున్న సమయంలో డ్రైవర్ బస్సును వెనక్కు రివర్స్ చేశాడు. ఈ సమయంలో బస్సు వెనుక చక్రం కింద విహాన్ పడ్డాడు. బస్సు టైర్లు బాలుని మీద పోవడంతో చిన్నారి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనతో ఒకకసారిగా ఆ ప్రాంతంలో విషాదఛాయలు అలముకున్నాయి. కుమారుని మృతి విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఘటనా స్థలానికి చేరుకుని గుండెలవసేలా రోధించారు. ప్రమాదానికి కారణం అయిన డ్రైవర్‌ను గ్రామస్తులు పోలీసులకు అప్పగించారు. ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హాకీలో అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి

ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

హాకీ క్రీడలో అంతర్జాతీయ స్థాయికి ఎదిగేలా క్రీడాకారులు కృషి చేయాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆకాంక్షించారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం ఏర్పాటుచేసిన శ్రీ సత్యసాయి జిల్లా హాకీ టోర్నమెంట్‌కు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యేతో పాటు మున్సిపల్ ఛైర్మన్ లింగం నిర్మల, మున్సిపల్ వైస్ ఛైర్మన్లు భాగ్యలక్ష్మి, పెనుజూరు నాగరాజు, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శీన, కౌన్సిలర్ చందమూరి నారాయణరెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలోని క్రీడా మైదానం అన్ని క్రీడలకూ వేదికగా మారడం క్రీడాకారులకు వరమని తెలిపారు. విన్నర్స్‌కు రూ. 50 వేలు, రన్నర్స్‌కు రూ. 25వేలు, మూడవ బహుమతిగా రూ. 10వేలు సొంత డబ్బు అండజేస్తానని హామీ ఇచ్చారు. ఏపీ హాకీ ఉపాధ్యక్షుడు, శ్రీ సత్య సాయి జిల్లా హాకీ జనరల్ సెక్రటరీ బంధనాదం సూర్యప్రకాష్ మాట్లాడుతూ బిఎస్ రాయుడు మెమోరియల్ రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు ఈ నెల 21న ప్రారంభమై 24వ తేదీ ముగుస్తాయని తెలిపారు. ఇందులో 15 జిల్లాల జట్లు పాల్గొంటున్నాయని, వారికి సాయి నగర్‌లోని షిరిడీ సాయిబాబా కల్యాణ మండపంలో ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పించామని తెలిపారు. శుక్రవారం జరిగిన పోటీల్లో అనంతపురం, ప్రకాషం జట్లు తల పడగా అనంతపురం గెలిచింది. అలాగే విజయనగరం వర్సెస్ తిరుపతి పోటీలో తిరుపతి విజేత, శ్రీకాకుళం వర్సెస్ నెల్లూరు తలపడగా నెల్లూరు విజేత, శ్రీ సత్య సాయి, కర్నూలు జట్లు తలపడగా సత్యసాయి జిల్లా విజేతగా నిలిచాయి. ఎన్టీఆర్ వర్సెస్ వైఎస్సార్ పోటీ డ్రా అయింది. ఈ కార్యక్రమంలో ఏపీ హాకీ అధ్యక్షుడు చాణక్యరాజు, జనరల్ సెక్రటరీ హర్షవర్ధన్, ఉమ్మడి జిల్లాల డిఎస్‌డివో జగన్నాథరెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఏపీ డైరెక్టర్ ఓబిరెడ్డి, ఊక అశ్వత్థనారాయణ, ఉడుముల రామచంద్ర, కట్టం వీరనారాయణ, శ్రీ సత్య సాయి జిల్లా పిఈటి అసోసియేషన్ అధ్యక్షుడు ఓబులేసు, అనిల్‌కుమార్, రఘునాథరావు, అరవింద్‌గౌడ్, చందు, అమురుద్దీన్, ఉడుముల కిరణ్, ఆమీ నూరుల్లా, ఊక రాఘవ, నారాయణస్వామి, మారుతి కుమార్, జాకీర్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ సత్యసాయి జిల్లా స్థాయి హాకీ టోర్నీ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

హరిత నేస్తం ఆధ్వర్యంలో చలివేంద్రం

ప్రజాశక్తి-కదిరి టౌన్

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కదిరి ఆర్టీసీ డిపో మేనేజర్

వేసవి నేపథ్యంలో ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు కదిరి బస్టాండు-1లో బెంగళూరు రియల్ ఎస్టేట్ వ్యాపారి పాళ్యం సుధాకర్ ఆర్.వో ప్లాంట్ ద్వారా తాగునీటి సౌకర్యం కల్పించారు. అలాగే బస్టాండు-2లో మదనపల్లి, పులివెందుల, రాయచోటి వైపు వెళ్లే ప్రయాణికుల కోసం చల్లని మినరల్ తాగునీటి సౌకర్యాన్ని హరిత నేస్తం వ్యవస్థాపకులు, అటవీ శాఖ అధికారి హరిప్రసాద్, కదిరి ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయగా శుక్రవారం కదిరి డిపో మేనేజర్ బి.మైనుద్దీన్ ప్రారంభించారు. అనంతరం హరిప్రసాద్‌ను కదిరి డిపో సిబ్బంది సన్మానించారు. ఈ కార్యక్రమమంలో అసిస్టెంట్ మేనేజర్ హరిమోహన్, హరిత, సిబ్బంది బాలరాజు, అబ్బాస్, తదితరులు పాల్గొన్నారు.

జీవో 52ను రద్దు చేయాలి:ఎఐబిఎస్ఎస్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జీవో నంబర్ 52ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం పుట్టపర్తిలోని గణేష్ కూడలిలో ఆల్ ఇండియా బంజారా సేవా సమితి(ఎఐబిఎస్ఎస్) ఆధ్వర్యంలో గిరిజన సంఘాల ఆధ్వర్యంలో ధర్నా, ర్యాలీ కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం కలెక్టర్ అరుణ్ బాబుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్లయినా గిరిజనులు అభివద్ధికి నోచుకోలేదని వాపోయారు. రాజకీయ నాయకులు స్వార్థ రాజకీయాల కోసం విద్య, రాజకీయం, ఆర్థికంగా అభివద్ధి చెందిన బోయ, వాల్మీకి, ఇతర బీసీ కులాలను ఎస్టీ జాబితాలో చేర్చడాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. అనంతరం గణేష్ కూడలి నుంచి కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహించగా పోలీసులు అడ్డుకొన్నారు. దీంతో బంజారా నాయకులు మాట్లాడుతూ శాంతియుతంగా ర్యాలీ చేస్తుంటే అడ్డుకోవడం ఏంటని ప్రశ్నించారు. ఎస్టీల సమస్యలను శాసనసభ వరకూ తీసుకెళ్లడానికి రాబోయే ఎన్నికల్లో కచ్చితంగా ఎస్టీలకు అసెంబ్లీలో సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేకపోతే గత ఎన్నికల్లో టిడిపికి పట్టిన గతే ఇప్పుడు వైసిపి ప్రభుత్వానికి పడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం సెక్రటరీ చక్రి నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగే నాయక్, సత్యసాయి జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు నాయక్, జనరల్ సెక్రటరీ కాలే నాయక్, రామాంజి నాయక్, రవి నాయక్, మండల అధ్యక్షుడు, కన్వీనర్లు, సెక్రటరీలు శ్యాంనాయక్, అంజి నాయక్, వెంకటరమణ నాయక్, పవన్‌కుమార్ నాయక్, గని నాయక్, డాక్టర్ నాగరాజు, రఘు, మధు, గిరిధర్ నాయక్, కాంతమ్మ బాయి, తదితరులు పాల్గొన్నారు.



పుట్టపర్తిలో ర్యాలీ చేస్తున్న ఎఐబిఎస్ఎస్ నాయకులు

రంజాన్ ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి - కదిరి టౌన్

రంజాన్ పండుగను పురస్కరించుకొని పట్టణంలోని ఈద్గాలో రంజాన్ ఏర్పాట్లను ఎమ్మెల్యే సిద్ధారెడ్డి, ముస్లిం మత పెద్దలు, మున్సిపల్ చైర్మన్ నజీమున్నీసా సాదిక్, కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్, పోలీస్ యంత్రాంగం తో కలిసి పరిశీలించారు. ఈద్గా మైదానంలో నిర్వహించే రంజాన్ ఏర్పాట్లపై ముస్లిం పెద్దలతో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శనివారం ఉదయం 8 గంటలకు ఈద్గా మైదానంలో ముస్లిం సోదరులు వేల సంఖ్యలో పాల్గొని నమాజ్ చేసుకోవడానికి కావలసిన ఏర్పాట్లను చేశామన్నారు. మున్సిపల్ యంత్రాంగం 4, 5 రోజుల నుండి మైదానాన్ని తీర్చి దిద్దేపనిలో నిమగ్నమైందన్నారు. ప్రభుత్వం తరపునుండి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఈసందర్భంగా ఆయన మైనార్టీ సోదరులకు ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

ఈద్గా మైదాన్ని అధికారులతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డా॥సిద్ధారెడ్డి

లేపాక్షి శిల్ప కళా వైభవాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

లేపాక్షి కట్టడాలు అద్భుతం : కలెక్టర్

ప్రజాశక్తి-లేపాక్షి

మండల కేంద్రమైన లేపాక్షిలో వెలసిన ప్రపంచ ప్రసిద్ధిగాంచిన వీరభద్రస్వామి ఆలయం అద్భుతమని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు పేర్కొన్నారు. కలెక్టర్ శుక్రవారం పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్‌తో కలిసి వీరభద్రస్వామి ఆలయాన్ని సందర్శించగా ఆలయ అధికారులు వారిని పూలమాలతో సత్కరించి పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఆ తరువాత లేపాక్షి ఆలయంలోకి వెళ్లిన కలెక్టర్‌కి టూరిజం గైడ్ విరూపన్న లేపాక్షి ఆలయ ప్రాశస్త్యం, చరిత్ర, కట్టడాలు, కుడ్య వర్ణ చిత్రాలు, శిల్ప సంపద, సీతమ్మ పాదం, వేలాడే స్తంభం, తదితర వివరాలను వారికి వివరించారు. ఆలయాన్ని సందర్శించిన కలెక్టర్ అద్భుతమని కొనియాడారు. ముఖ్యంగా వేలాడే స్తంభాన్ని చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఆలయాన్ని సందర్శించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అతి పెద్దదైన నంది విగ్రహాన్ని, జటాయువు థీమ్ పార్క్‌ని కలెక్టర్ సందర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టూరిజం అధికారి నాగేశ్వర్ రెడ్డి, తహసీల్దార్ బాబు, టూరిజం మేనేజర్ లక్ష్మణ్ రావు, ఆలయ ఈవో నరసింహమూర్తి, వేద పండితులు లక్ష్మీనరసింహశర్మ, శ్రీనివాస కుమార్, విఆర్ఓ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు

కదిరి టౌన్ :ముస్లిం సోదరులకు వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరిప్రసాద్ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మాసంలో ముస్లిం సోదరులు కఠోర ఉపవాస దీక్షతో ఉఉంటారన్నారు. బీద, ధనిక అనే తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరూ ఉన్నదానిలో ఎంతోకొంత దానధర్మాలు చేస్తూ సేవా దృక్పథాన్ని చాటుకుంటారని అన్నారు. సహనానికి ప్రతీకగా ఈ పండుగను జరుపుకుంటారని ఆయన చెప్పారు. పండుగను సంతోషంగా జరుపుకోవాలన్నారు.

కోడి కోయలేం.. మటన్ కొనలేం...

విక్రయించడానికి వుంచిన కోళ్లు

ప్రజాశక్తి - హిందూపురం

మార్కెట్‌లో కూరగాయలు, మటన్, చికెన్ ధరలు పేద మధ్యతరగతి కుటుంబాలకు చుక్కలు చూపిస్తున్నాయి. టమోటా రేటు ఎరుపెక్కింది. కోడి ధర కొండెక్కింది. పచ్చి మిర్చి మంట పుట్టిస్తోంది. ప్రస్తుతం పెరిగిన ధరలతో సామాన్య, మధ్యతరగతి, పేద కుటుంబాలు రంజాన్ పండుగ పూట సైతం రుచికరమైన భోజనం తినలేక తమ నోటికి కుట్లు వేసుకుంటున్నారు.

కూలి నాలి చేసుకొని జీవించే సామాన్య మధ్యతరగతి కుటుంబాలకు కాయగూరలతో పాటు నిత్యవసర సరకుల ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. ప్రస్తుతం వున్న ధరలతో కోడిని కోయలేక మటన్ కొనలేక కోరికలు చంపుకొని నోరు కట్టుకొనే పరిస్థితి దాపురించింది. ధరలు ఇలాగే కొనసాగితే పెరుగు పచ్చడి మెతుకులే పంచభక్ష పరమాన్నంగా భావించి తినే పరిస్థితి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాస్తున్న ఎండలతో పనులకు వెళ్లలేక, ఉన్న కాస్త డబ్బులతో ఎలాగోలా కుటుంబాన్ని ఈడుస్తున్న ప్రజలకు మార్కెట్‌లో కూరగాయల ధరలు గుదిబండగా మారాయి. భగభగ మండే సూర్యుడితో రేట్లు పోటీ పడుతూ నేల దిగడానికి మొరాయిస్తున్నాయి.

రుచికరమైన తిండి తినేదెన్నడో.....

ఎండనకా, వాననకా కష్టపడి తెచ్చే నాలుగు రూపాయలతో కుటుంబాన్ని ఈదలేక రుచికరమైన తిండి అందించలేక మధ్యతరగతి కుటుంబాలు సతమతమవుతున్నాయి. కూరగాయల మార్కెట్‌లోకి వెళ్లాలంటే మండే ధరలతో గుండె ఆగినంత పని అవుతోందని బాధపడుతున్నారు. గతంలో రూ.150లు ఉంటే బ్యాగు నిండుగా కూరగాయలు వచ్చేవని అయితే పెరిగిన ధరలతో రూ.500లు తీసుకెళ్ళినా నిండటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంపదంతా కూరగాయలకు వెచ్చిస్తే ఇక సంసారాన్ని ఎలా ఈదాలో అర్థం కాక సామాన్యుడు తలపట్టుకుంటున్నాడు.

పండుగ రోజుల్లో దూరమవుతున్న ఆనందం

సంవత్సరమంతా కష్టపడి పనిచేసినప్పటికి కలుగని ఆనందం పండుగ రోజుల్లో కలుగుతుంది. ఆరోజు ఇంటిల్లిపాది కూర్చొని రుచికరమైన భోజనం తింటూ సంతోషపడే వారికి ఆ చిన్న ఆనందం కూడా దూరమైంది. గతంలో కేజీ చికెన్ రూ.100ల నుండి రూ.120లు ఉండగా ఇప్పుడు అమాంతంగా రూ. 200 నుండి రూ.220కి పెరిగింద, ఇక మటన్ అయితే మాట్లాడే పరిస్థితి లేదు. కిలో మటన్ రూ.700 నుంచి 800 రూపాయల దాకా ఉంది. దీంతో చికన్ కొనలేని ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఇంటికి రెండు కిలోలు తీసుకెళ్లే వారు కూడా ప్రస్తుతం ఒక కేజీతో సరిపెట్టుకుంటున్నారు. టమోటా అయితే గత 10 రోజుల క్రితం రూ.15 ఉంటే నేడు ఏకంగా రూ.30 ధర ఉంది. టమోటా లేనిదే ఏ కూర చేయలేం. ఏది కొనాలో అర్థం కాక పేద మధ్యతరగతి కుటుంబాలు సతమతమవుతున్నాయి.

రంజాన్ వేళ సామాన్యులపై ధరాభారం

ఏదీ కొనలేకపోతున్నాం

ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న కూరగాయలు కొనలేని పరిస్థితి వుంది. ఏ ఒక్కటి పట్టుకున్నా కిలో రూ. 50 నుండి 150 రూపాయల వరకు వుంటుంది. పెరిగిన ధరలతో మార్కెట్ వైపు వెళ్లాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. సామాన్యుడికి అందుబాటులో వుండేలా ధరలను నియంత్రించాలి.

షబాన బాను, గృహిణి, హిందూపురం

ధరలు అధికంగా ఉన్నాయి

నిత్యం వండే కూరల్లో వాడాల్సిన కూరగాయల ధరలు ఆకాశంలో వుంటే వాటిని ఎలా కొనాలి..? ఎలా వండాలి ? చికన్ కొంటే వండటానికి కావాల్సిన మసాలాలకు కావాల్సిన టమోటా, అల్లం వంటివి కొనాలంటే వాటి ధరలు చూసి కళ్ళు బైర్లు కమ్ముతున్నాయి. పెరిగిన ధరలతో ఏమి కొనలేని పరిస్థితి ఉంది.

ఫయాజ్, హిందూపురం

అధిక ధరలను నియంత్రించాలి

నిత్యావసర ధరలను నియంత్రించి సామాన్యుడికి అందుబాటులో వుండేలా చూడాలి. నిత్యం అవసరమైన కూరగాయల ధరలు అధికంగా వుంటే సామాన్యుడు ఎలా బతకాలి. ధరలు తగ్గించి ప్రజలు అందుబాటులో వుంచాలి. చివరకు పచ్చడి చేసుకోవడానికి ఉపయోగించే పచ్చిమిర్చి కూడా కొనలేని పరిస్థితి ఏర్పడింది. పెరిగిన ధరలు రంజాన్ నెలవంకకు చేరువలో ఉన్నాయి.

జబీవుల్లా, హిందూపురం

పేకాట జూదరులు అరెస్టు

మడకశిర : పేకాట ఆడుతున్న పదిమందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ సురేష్ బాబు తెలిపారు. తమకు వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో మెరుపు దాడి చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుండి రూ. 20,500ల నగదు, 10 ద్విచక్రవాహనాలు, 9 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసకున్నామన్నారు.

పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి

రొద్దం : పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని చెత్త సంపద కేంద్రంలో గురువారం దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సిపిఎం మండల అధ్యక్షుడు ఫకృద్దీన్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంఘాల నాయకులు మాట్లాడుతూ పోలీసు అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు. వారం రోజుల క్రితం కోగిర, శ్యాపురం గ్రామాల దళితులు, గిరిజనులు వారి భూముల్లో వ్యవసాయ పనులు చేసుకుంటుండగా కొందరు బలవంతంగా, దౌర్జన్యంగా భూముల్లోకి ప్రవేశించి కులం పేరుతో అసభ్య పదజాలంతో దూషించి దాడి చేసి పనులకు అడ్డుపడ్డారన్నారు. దీనిపై అదే రోజు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినా కేసులు నమోదు చేయకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. దీంతో బాధితుల తరపున దళిత, గిరిజన, ప్రజా సంఘాలు సమస్యను ఉన్నతాధికారుల దష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగే వరకూ పోరాడుతామని సమావేశంలో ఏక గ్రీవంగా తీర్మానించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యద్శి గంగాధర్, వెంకటరాముడు, నారాయణ, కృష్ణప్ప, మారుతి, భూచెర్ల నరసింహులు, ఎంఆర్‌పిఎస్ నాయకులు నల్లూరు నాగరాజు, పంచాయతీ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

అమరాపురంలో వరుస చోరీలు

అమరాపురం : మండల కేంద్రంలో జరుగుతున్న వరుస చోరీలతో ప్రజలు భయాందోళకు గురవుతున్నారు. శాంతి భద్రతల విషయంలో పోలీసులు నిర్లక్ష్య వైఖరిని అవలంభిస్తోందన్నారు. ఇందిరమ్మ కాలనీలో 15 రోజుల క్రిత ఇంటిలో ఎవరు లేనిది చూసి ఇంటి తాళాలను పగుల కొట్టి అందులో గల విలువైన వస్తువులను దొంగలించారు. మరో ఇంటిలో ముప్పై ఐదు వేల నగదు, బంగారు గొలుసులను ఎత్తుకెళ్లారు. వారం రోజుల క్రితం మళ్లీ ఒక ఇంటిలో రూపాయి, 1, 5000 ఇలా దొంగలు చోరీ చేస్తున్న సమాచారంతో ప్రజలు రాత్రిపూట ఆరుబయట నిద్రిస్తున్నారన్నారు. అదేవిధంగా బస్టాండ్ చుట్టుపక్కల కర్నాటక మద్యం ఏరులై పారుతున్న అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించాల్సిన అవసరం ఉందన్నారు, ఇప్పటికైనా అధికారులు స్పందించి చోరీలను ఆపాలని కోరుతున్నారు.

దుస్తుల దుకాణాల్లో తనిఖీలు

హిందూపురం : లీగల్ మెట్రాలజీ ఇన్స్‌పెక్టర్ శివశంకర్ శుక్రవారం పట్టణంలోని బట్టల దుకాణాలపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు దుకాణాల్లో మూడు కేసులను నమోదు చేసి, జరిమాన విధించినట్లు ఆయన తెలిపారు. బట్టల దుకాణాలదారులు వారు సొంతంగా ధరలను ముద్రించి, విక్రయించడానికి లేదన్నారు. ఇలా వ్యాపారాలు చేస్తే వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు భారీ ఎత్తున జరిమానాలు విధిస్తామన్నారు. ప్రతి వస్తువుపైనా కంపెనీ నిర్ణీత ధర ఉండాలన్నారు. వ్యాపారులు ధరలు నిర్ణయించి విక్రయాలు జరిపితే కేసులు నమోదు చేస్తామన్నారు. నిబంధనలు అతిక్రమించి అధిక ధరలకు విక్రయాలు జరిపితే ఎంతటి వారైన వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు శాఖ పరమైన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో లీగల్ మెట్రాలజీ సిబ్బంది పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం

లేపాక్షి : మండల కేంద్రానికి చెందిన కురుబ సుకన్య (28) ఇటీవల మృతిచెందింది. దీంతో మృతురాలి కుటుంబానికి హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఈసందర్భంగా 25 వేల రూపాయలు సుకన్య భర్త కురుబ రమేష్‌కు హిందూపురం కురుబ సంఘం వారి ద్వారా శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలకన్వీనర్ జయప్ప, లేపాక్షి కురుబ సంఘం నాయకులు మాజీ ఎంపీపీ ఆనంద్ కుమార్, నాయకులు శ్రీరాములు, జయరామప్ప, నంజుండప్ప, అన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన సేవలు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

రైతుభరోసా కేంద్రాలలో సిబ్బంది అందుబాటులో ఉంటూ నాణ్యమైన సేవలు రైతులకు అందించాలని జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి సలహా మండలి సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఏ. రమణారెడ్డి, జెడ్‌పి చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల సిబ్బందితో మండల జిల్లా స్థాయి లలో ప్రతినెల తప్పనిసరిగా సమావేశాలు నిర్వహించాలన్నారు. రైతులకు మేలు జరిగే విధంగా ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలన్న ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఆర్‌బికెల్లో వ్యవసాయ ఉధ్యానవన ఇతర క్షేత్రస్థాయి సహాయకులు అందుబాటులో ఉండాలన్నారు. రైతులకు అవసరమైన మామిడి, సపోటా, చీనీ తదితర మొక్కలు అందించాలన్నారు. అగ్రి అడ్వైజరీ చైర్మన్ రమణారెడ్డి మాట్లాడుతూ తాము జిల్లాలోని 32 మండలాల్లోని ఆర్‌బికెలను తనిఖీ చేస్తూ రైతు సమస్యలు తెలుసుకుంటున్నామన్నారు. కొన్నిచోట్ల ఆర్‌బికెలు అద్దె భవనాల్లోఉంటున్నాయని శాశ్వత భవనాలు నిర్మించాలని కోరారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ రైతుల పక్షపాతిగా ఎన్నో పథకాలు ప్రవేశపెడుతున్నారన్నారు. వేసవిలో రైతులు భూసార పరీక్షలు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. పలు ఆర్‌బికెలలో సిబ్బంది కొరత ఉందని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి సుబ్బారావు, ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్, సిరికల్చర్ జెడి పద్మమ్మ, మార్కెటింగ్ అధికారి నరసింహమూర్తి, కదిరి వ్యవసాయ ప్రధాన శాస్త్రవేత్తలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

బిజెపిని సాగనంపుదాం

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

ప్రజా వ్యతిరేక, నిరంకుశ మతోన్మాద బిజెపిని సాగనంపి, దేశాన్ని కాపాడు కొందామని సిపిఎం నాయకులు బ్యాళ్ళ అంజి పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని కర్నాటక నాగేపల్లికి వెళ్లే రహదారిలో ప్రచార భేరి గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొమ్మిది ఏళ్ల బిజెపి పాలనలో ప్రధాని మోడీ కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్నారే తప్ప రైతులకు కార్మికులకు చేసిందేమీ లేదన్నారు. కార్పొరేట్ శక్తులకు లక్షల కోట్ల రూపాయల రుణమాఫీ చేస్తూ కార్మిక కర్షక, చిన్న వ్యాపారులు ఇతర పేద వర్గాలకు మొండి చేయి చూపుతున్నారన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబించడమే గాక నిరంకుశ పాలన చేస్తూ మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్నారన్నారు. అందుకే ఈవిషయాలన్నింటి పైన ఈనెల 14 నుంచి 30 వరకు ప్రచారభేరీ ద్వారా ప్రజలను చైతన్య పరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తిరుపాలప్ప, పెద్ద తిరుపాల్, సన్నోడు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

రేపు 'అమృతవల్లి సదన్' ప్రారంభం

ప్రజాశక్తి-కదిరి టౌన్

ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం శ్రీచలపతినాయుని సత్రం బజార్‌లోని(శ్రీ అమత వళ్ళి సదన్) యాత్రికుల వసతి సముదాయాన్ని ఆదివారం ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే సిద్దారెడ్డి ప్రారంభిస్తారని ఆలయ కార్యనిర్వహణ అధికారి, గోపాలకృష్ణ, ఆలయ కమిటీ చైర్మన్ శుక్రవారం ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు .

ముగిసిన లోకోస్ యాప్ శిక్షణ

గాండ్లపెంట : స్థానిక మండల సమైక్య ఐకెపి కార్యాలయంలో పది మండలాల ఎపిఎ, సిసి, వివోలకు మూడు రోజుల నుంచి ఇస్తున్న లోకోస్ యాప్ శిక్షణ శుక్రవారం ముగిసింది. ఎపిఎం సూర్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ముగింపు కార్యక్రమానికి సత్యసాయి జిల్లా వెలుగు పీడీ నరసయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడు రోజుల నుంచి లోకస్ యాప్‌పై శిక్షణ ఇచ్చామన్నారు. ఇక నుంచి ఈ యాప్ నుంచే సంఘ సభ్యురాలి వివరాలను ఇతర లావాదేవీలు జరుగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎపిఎంలు జయంతి, రవి, సీసీలు మోహన్ రెడ్డి, వరప్రసాద్, షాకీర్, చెన్నకేశవులు, మండల సమైక్య అధ్యక్షురాలు సంధ్యారాణి, అకౌంటెంట్ ఎం జానకితో పాటు 10 మండలాల ఎపిఎంలు, సిసిలు, విఒలు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ తనిఖీ

గాండ్లపెంట : మండల పరిధిలోని కటారుపల్లి క్రాస్ వద్ద ఉన్న కేజీబీవీని ఎంపీడీవో డి.ఆంజినప్ప శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విద్యాభ్యాసంతో పాటు క్రీడలు, ఆర్ట్, కంప్యూటర్ విద్య అందించాలని సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఎస్ఓ దుర్గాను ఆదేశించారు. విద్యార్థులు విద్యాభ్యాసంలో గ్రేడ్ వన్‌లో రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

గోరంట్ల : పట్టణంలో తహశీల్దార్ కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తహశీల్దార్ రంగనాయకులు శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు, సర్వేయర్లు, వీఆర్‌ఏలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అక్కదేవతల ఉత్సవం

ఓబుల దేవర చెరువు : మండలంలోని అల్లాపల్లి పంచాయతీ గౌని పల్లిలో శుక్రవారం అక్కదేవతల ఎలవ గంప ఉత్సవ పూజలు ఘనంగా నిర్వహించారు ముందుగా మహిళలంతా కలసి పసుపు, కుంకుమ, గాజులు, చీరలు, నవధాన్యాలు, పూలు అమ్మవారి పూజ సామాగ్రితో ఎలవ గంప ఏర్పాటు చేసుకుని గుడి వద్దకు చేరుకొని కర్పూరాలు పుష్పాలు సమర్పించారు. అనంతరం అమ్మవారి ప్రతిరూపంగా ఏడు మంది చిన్నారులని అక్కదేవతల ప్రతిమలకు జలాభిషేకం, పసుపు, కుంకుమ జలాభి అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

పెనుకొండ: గిరిజనుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఆల్ ఇండియా బంజారా సేవా సమితి రాష్ట్ర కార్యదర్శి చక్రినాయక్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి జిల్లాకేంద్రంలో శుక్రవారం నిర్వహించే ధర్నాకు మండలం నుంచి తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ మండల కమిటీ అధ్యక్షులు శ్యాంసుందర్ నాయక్, ప్రధాన కార్యదర్శి గంగాధర్ నాయక్, ఉపాధ్యక్షులు చంద్రానాయక్ తదితరులు పాల్గొన్నారు.

6న ఉచిత ఖత్నా

కొత్తచెరువు : కొత్తచెరువులోనే హజరత్ మస్తాన్ వలి దర్గాలో మే 6వ తేదీ జామియా మసీదు ఆధ్వర్యంలో ఉచిత ఖత్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు దర్గా కమిటీ మేనేజర్ అత్తవుల్ రహిమాన్ ఓ ప్రకటనలో తెలిపారు. ముస్లిం బాలుర తల్లిదండ్రులు మే 1వ తేదీ లోపు అరటికాయల సత్తార్ సాబ్ దర్గా కాంప్లెక్స్, నూరుల్లా ఫట్ వేర్, బాబా ఎగ్ సెంటర్ చిరునామాల్లో పేర్లు నమోదు చేయాలని సూచించారు. పేర్లు నమోదు చేసుకొన్న వారు ఆ రోజు ఉదయం 8 గంటలకు దర్గా వద్దకు చేరుకోవాలన్నారు. ఇక్కడకు వచ్చిన పిల్లలకు మందులు, తదితర వస్తువులు ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. అల్పాహారం కూడా ఏర్పాటు చేస్తామన్నారు.

టీడీపీ నేత కుటుంబానికి సూరి పరామర్శ

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ధర్మవరం మండల పరిధిలోని చింతలపల్లి గ్రామానికి చెందిన అన్నమనేని పుల్లానాయుడు రెండు రోజుల క్రితం గుండెపోటుతో మతిచెందిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ చింతలపల్లి గ్రామం వెళ్లి పుల్లానాయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళలర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను, పరామర్శించి భరోసా ఇచ్చారు. ఆయన వెంట పతకమూరి సుబ్బయ్య, పతకమూరి పెద్దప్పయ్య, పతకమూరి నారాయణస్వామి, పతకమూరి ఆంజనేయులు, పతకమూరి శ్రీనివాసులు, పతకమూరి లక్ష్మీనారాయణ, పతకమూర్తి శివయ్య, నారా కొం డయ్య, చల్లా వెంకటేశ్, చక్కరయ్య, రంగయ్య, అశ్వర్థనారాయణ, తదితరులు ఉన్నారు.

చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే సూరి

ఉపాధ్యాయుడికి సన్మానం

ప్రజాశక్తి - చిలమత్తూరు

20 సంవత్సరాలుగా హిందూపురంలోని సప్తగిరి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా పనిచేసి ఎంతో మంది పేద విద్యార్థులకు విద్యనందించిన ఈశ్వర్ రెడ్డికి 1998 డీఎస్సీ ఉపాధ్యాయుడిగా కొలువు వచ్చింది. ఇందులో భాగంగా చిలమత్తూరు మండలం టేకులోడు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. దీంతో గతంలో సప్తగిరి కళాశాలలో చదివిన విద్యార్థులు శుక్రవారం ఈశ్వర్ రెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమం లో ప్రదానోపాధ్యాయుడు సాదీక్, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, ప్రజాశక్తి విలేకరి గంగరాజు, డిజిటల్ అసిస్టెంట్ మహేష్, గ్లోబల్ ఎడ్యుకేషన్ ఇన్యుస్టూట్ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఈశ్వర్ రెడ్డి ని సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

చరిత్ర సృష్టిస్తున్న యువగళం పాదయాత్ర : పరిటాల

ప్రజాశక్తి-రామగిరి

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర చరిత్రలో నిలిచిపోతుందని మాజీ మంత్రి పరిటాల సునీత అన్నారు. లోకేష్ పాదయాత్ర వేయికిలోమీటర్లు చేరుకున్న సందర్భంగా ఆమె శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నారాలోకేష్ అత్యంత సునాయాసంగా 1000 కిలోమీటర్లు పూర్తి చేసుకున్నారన్నారు. గతంలో ఏ నాయకుడు కూడా ఇలా ప్రజా సమస్యలు తెలుసుకుంటూ ప్రజల మధ్య పాదయాత్ర చేసిన పరిస్థితి లేదన్నారు. ఆయన చేస్తున్న పాదయాత్రతో వైసిపి నాయకుల్లో వణుకు పుట్టుకుందని.. కేవలం మూడు జిల్లాలకే ఆయన పాదయాత్ర ప్రకంపనలు సృష్టిస్తోందని అన్నారు. ఇప్పటికే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆ ప్రభావం స్పష్టంగా కనిపించిందన్నారు. ఆయన ఇలాగే దిగ్విజయంగా అన్ని జిల్లాల్లో పాదయాత్ర కొనసాగుతుందన్నారు. ఈ పాదయాత్ర 4000 కిలోమీటర్లు దాటే అవకాశం కూడా కనిపిస్తోందన్నారు. ఎంతో ఉన్నతమైన కుటుంబంలో పుట్టి కేవలం ప్రజల కోసం ఇలా కుటుంబ సభ్యులందరినీ వదిలేసి మండుటెండని లెక్కచేయకుండా పాదయాత్ర చేయడం గొప్ప విషయమన్నారు. కచ్చితంగా లోకేష్ పాదయాత్ర తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకొస్తుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటికే వైసీపీ పతనం ప్రారంభమైందని వ్యాఖ్యానించారు.

పెన్నా నదిలో మట్టిరోడ్డు ఏర్పాటు

ప్రజాశక్తి రొద్దం

మండలంలోని పలు గ్రామాలు పెన్నానదికి సమీపంలో ఉన్నాయి. దీంతో ఆయా గ్రామాలకు పెన్నానదిలో రాకపోకలకు ఇబ్బందులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో నెల రోజుల క్రితం నల్లూరు, కల్లుకుంట గ్రామాలకు మధ్య ఉన్న పెన్నానదిలో రోడ్డు వేశారు. తాజాగా శుక్రవారం రొద్దం నుంచి చిన్నకోడిపల్లి వెళ్లే దారిలో పెన్నానదిలో రొద్దం సర్పంచ్ రూప, ఎంపీపీచంద్రశేఖర్ ఆధ్వర్యంలో సర్పంచ్ నిధులతో నదిలో మట్టి రోడ్డు ఏర్పాటు చేశారు. దీంతో చిన్నకోడిపల్లి చోలెమర్రి గ్రామాల ప్రజలకు కొద్దిపాటి సమస్య తొలగిందని ఆయా గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు గోపాల్, రెడ్డి,మారుతీ, నరసింహారెడ్డి, వార్డ్ మెంబర్ శంకర, శేషు, తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

ప్రజాశక్తి - పరిగి

వేసవికాలంలో మండలంలోని ఏ గ్రామంలోనూ త్రాగునీటి ఎద్దడి తలెత్తకుండా మందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకుని అధికారులు పనిచేయాలని డిఎల్‌పిఒ బాలాజీ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం పరిగి పంచాయతీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై అధికారులతో ఆరా తీశారు. కొన్ని గ్రామాలలో వేసవిలో తాగునీటి ఎద్దడి ఉండటంతో ఆ గ్రామాలకు నీటి ట్యాంకుల ద్వారా నీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఈవోఆర్డీ చంద్రశేఖర్‌కు సూచించారు. పరిగి పంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు మూడు నెలల వేతనాలు ఇవ్వాలని దీంతోపాటు కార్మికులకు అందించే సదుపాయాలు విషయంలో పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని తమకు రావలసిన సదుపాయాలను అందించాలని ఆయనను కార్మికులు కోరారు.

రాప్తాడుకు మాజీ మంత్రి సెల్ఫీ ఛాలెంజ్

ప్రజాశక్తి - రామగిరి

రాప్తాడు ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి మాటలు కోటలు దాటితే చేతలు గడప కూడా దాటవని మాజీ మంత్రి పరిటాల సునీత విమర్శించారు. జీడిపల్లి రిజర్వాయర్ నుంచి పేరూరు రిజర్వాయర్ కు నీరు అందించే ప్రాజెక్టుకు సంబంధించిన కాల్వ వద్ద నుంచి ఆమె ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డికి సెల్ఫీ చాలెంజ్ విసిరారు. తెలుగుదేశం పార్టీ హయాంలో రూ. 804 కోట్లతో ఈ పథకాన్ని ప్రారంభించిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. జీడిపల్లి జలాశయం నుంచి నేరుగా పేరూరు జలాశయానికి నీరు అందిస్తూ మధ్యలో పుట్టకనుమ, సోమరవాండ్లపల్లి రిజర్వాయర్లను నిర్మాణం చేపట్టాలని గత ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇందుకు భూసేకరణ నిధులు కూడా కొంతమేర కేటాయించిందని చెప్పారు. అప్పట్లో 30శాతం వరకు కాలువ పనులు కూడా జరిగాయన్నారు. అయితే వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ప్రాజెక్టు డిజైన్ పూర్తిగా మార్చారని విమర్శించారు. మధ్యలో పుట్టకనుమ రిజర్వాయర్ తీసివేసి ముట్టాల, తోపుదుర్తి, దేవరకొండ రిజర్వాయర్లు నిర్మించాలని నిర్ణయించారన్నారు. కానీ ఇప్పటివరకు దానికి సంబంధించిన ఏ ఒక్క పని పూర్తి కాలేదని విమర్శించారు. వారు నిర్మిస్తామన్న ప్రాజెక్ట్ ఏమైందని ప్రశ్నించారు. మరో ఏడాదిలో అధికారం ముగుస్తుందని ఈ లోపు ఎంత పని చేయగలుగుతారని ఆమె ప్రశ్నించారు. నిత్యం పరిటాల కుటుంబం పై విమర్శలు చేస్తూ కోటలు దాటేలా మాటలు మాట్లాడడం కాదని చేతల్లో పని చూపించాలని పరిటాల సునీత సూచించారు.

ఆర్‌బికె సిబ్బందితో సమీక్ష

పుట్టపర్తి రూరల్: రైతు సంక్షేమ పథకాలపై ఏడీఏ స్వయంప్రభ ఆర్‌బికె సిబ్బందితో సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. పుట్టపర్తి వ్యవసాయ కార్యాలయంలో మండలంలోని ఆర్‌బికె సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ రైతుల ఇంటి వద్దకే ప్రభుత్వ సంక్షేమ పథకాలను చేరవేయడానికి రైతు భరోసా కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. సంక్షేమ పథకాలను సక్రమంగా రైతులకు అందించే బాధ్యత ఆర్‌బికె సిబ్బందిదే అని అన్నారు. ప్రస్తుత వేసవికాలంలో మట్టి నమూనాలను సేకరించాలన్నారు. మట్టిని సేకరించే పద్ధతిని గురించి ఈసందర్భంగా వివరంచారు. పభుత్వం సబ్సిడీ పై అందించిన ట్రాక్టర్లు, వ్యవసాయ పనిముట్లు రైతులకు అద్దె ప్రాతిపదికన అందించు సేవలను రికార్డులలో నమోదు చేయించాలని సూచించారు. రైతులకు పట్టాదారు పాసుపుస్తకం ఉండి రైతు భరోసా కు నమోదు చేసుకోకుంటే వారితో చేయించాలని చెప్పారు. రైతులను ఖరీఫ్ సీజన్ కు సమాయత్త పరుస్తూ,వేసవి దుక్కులు చేసుకోవాలన్నారు. వాటి వలన కలిగే ఉపయోగాల గురించి తెలియజేయాలన్నారు. రైతు భరోసా కేంద్రాలలో రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి మండల వ్యవసాయ అధికారి వెంకట బ్రహ్మం, వ్యవసాయ విస్తరణ అధికారి ఆనంద నాయక్, ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి హయాంలోనే కొండ రోడ్డుకు నిధులు మంజూరు : బికె

పెనుకొండ : పెనుకొండ పట్టణం నుంచకొండమీద లక్ష్మీనరసింహ స్వామి దేవాలయానికి టిడిపి హయాంలోనే 2017-2018 సంవత్సరంలో రూ 14 కోట్లు నిధులు మంజూరు అయ్యాయని మాజీ ఎమ్మెల్యే బికె. పార్థసారథి అన్నారు. పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం పట్టణంలోని కొండ రోడ్డు పైకి వెళ్లి సెల్ఫీ విత్ ఛాలెంజ్ ను విసిరారు.

పెరిగిన ధరలతో సామాన్యులకు భారం

రొద్దం : రాష్ట్రంలో పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు ప్రజలకు భారంగా మారాయని టిడిపి నాయకులు అన్నారు. ఈ మేరకు వారు శుక్రవారం మండలంలోని గౌరాజుపల్లిలో నిర్వహించిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరవాత విద్యుత్ చార్జీల పెంపుతో పాటు నిత్యావసర వస్తువులు ధరలు అమాంతం పెరిగిపోయాయన్నారు. వైసిపి ప్రభుత్వాన్ని సాగనంపుదామని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రొద్దం క్లస్టర్ ఇన్‌ఛార్జి నాగేంద్ర, మాజీ సర్పంచి నారాయణప్ప, రాజప్ప, క్రిష్టప్ప, వెంకటేసులు, సుబ్బరాయుడు, వెంకటేసులు, రాము తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్, ఎస్పీలను కలిసిన 'బికె'

పుట్టపర్తి రూరల్ : ఉమ్మడి అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు బి.కె పార్థసారథి శుక్రవారం శ్రీసత్యసాయి జిల్లా నూతన కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డిలను వారి వారి కార్యాలయాల్లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో పాటు టిడిపి పట్టణ కన్వీనర్ రామాంజనేయులు, హిందూపురం పార్లమెంట్ ఇన్‌చార్జి సామకోటి ఆదినారాయణ ఉన్నారు. ఈ సందర్భంగా పార్థ ప్రతిపక్ష పార్టీలపై జిల్లాలో జరుగుతున్న దాడులను ఎస్పీకి వివరించారు. అనంతరం పుట్టపర్తి టిడిపి యువ నాయకులు, ఐటిడిపి నియోజకవర్గ అధ్యక్షుడు కొత్తపల్లి జయప్రకాష్, సామకోటి ఆదినారాయణ, పట్టణ కన్వీనర్ రామాంజనేయులు, మనోహర్ మాల పార్థసారధికి సత్యసాయి చిత్రపటం అందజేసి శాలువాతో సత్కరించారు.

వీరసింహారెడ్డి శతదినోత్సవ వేడుకలు వాయిదా

హిందూపురం : స్థానిక శాసన సభ్యులు, సినీ నటుడు నందమూరి బాలకృష్ణ నటించిన వీర సింహారెడ్డి శతదినోత్సవ వేడుకలు తాత్కాలికంగా వాయిదా వేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు బాలయ్య అభిమానుల సంఘం జాతీయ కన్వీనర్ నంబూరి సతీష్ కుమార్ మాట్లాడుతు పట్టణంలోని ఎంజిఎం హైస్కూల్ గ్రౌండ్‌లో ఈ నెల 23న వీర సింహరెడ్డి సినిమా వంద రోజుల వేడుకలు నిర్వహించాలని ఎమ్మెల్యే బాలకృష్ణ, నిర్మాతలు నిర్ణయించారన్నారు. అయితే ఇందుకు మున్సిపల్ కార్యాలయం నుండి అనుమతి నిరాకరించడంతో టీడీపీ శ్రేణులు, బాలయ్య అభిమానులు గురువారం పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారన్నారు. ఈ క్రమంలో శతదినోత్సవ వేడుకలు వాయిదా వేసినట్లు టీడీపీ నేతలు, బాలయ్య అభిమానులు వెల్లడించారు. తిరిగి ఎప్పుడు నిర్వహించేది త్వరలో తెలియజేస్తామని వారు తెలిపారు.